సాక్షి వికారాబాద్

ఆదివారం । 30 । జులై । 2023



పెంపు అంతంతే..!

ప్రభుత్వం నిర్ణయిస్తున్న పంటల రుణ పరిమితి పెట్టుబడులకు ఏమాత్రం సరిపోవడంలేదు. 8లో▸



హరితంపై గొడ్డలి పెట్టు

ప్రభుత్వం హరితహారాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తుంటే విద్యుత్ అధికారులు మరమ్మతుల పేరుతోనరికేస్తున్నారు. 8లో▸



పంటలు నీటిపాలు

వరుణదేవుడా కరుణించి అని సీజన్ ప్రారంభంలో వేడుకున్న రైతులకు ప్రస్తుతం అధిక వర్షాలతో తీవ్ర నష్టం వాటిల్లింది. 9లో▸

న్యూస్‌రీల్

రేపటి నుంచి పశువులకు టీకాలు

వికారాబాద్ అర్బన్: జిల్లాలో సోమవారం (జూలై 31) నుంచి జాతీయ పశువ్యాధుల నివారణ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి అనిల్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం ఆగస్టు 29వ తేదీ వరకు కొనసాగుతుందని.. గోవు, గేదెజాతి పశువుల్లో గాలికుంటు వ్యాధి నివారణకు ఉచితంగా టీకాలు వేయనున్నట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పశువులకు టీకాలు వేయించాలన్నారు.

ఫ్లెక్సీల చించివేతపై ఎస్పీకి ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న యువసేన సభ్యులు

తాండూరు టౌన్: బీసీ కమిషన్ రాష్ట్ర సభ్యుడు శుభప్రద్ పటేల్ పుట్టినరోజును పురస్కరించుకుని ఈనెల 27న తాండూరు పట్టణంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను చించిన వారిపై చర్యలు తీసుకోవాలని శుభప్రద్ పటేల్ యువసేన సభ్యులు శనివారం జిల్లా ఎస్పీ కోటిరెడ్డికి ఫిర్యాదు చేశారు. తాండూరులో బీసీ సామాజిక వర్గానికి చెందిన నాయకులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని కోరారు. అయితే ఈవిషయమై శుక్రవారమే తాండూరుపట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదులు అందాయని.. చర్యలు తీసుకునేందుకు కోర్టు అనుమతి కోసం వేచి చూస్తున్నామని తాండూరు డీఎస్పీ శేఖర్‌గౌడ్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎస్పీకి ఫిర్యాదు చేసినవారిలో యువసేన అధ్యక్షుడు భానుప్రసాద్, సభ్యులు సచిన్, బాలు, రాముగౌడ్, విజయ్, నరేష్‌గౌడ్, చందు, శ్రీశైలం తదితరులు ఉన్నారు.

పాలుతాగావా.. బసవన్నా!



నందీశ్వరుడికి పాలు తాగిస్తున్న భక్తులు

తాండూరు రూరల్: మండల పరిధిలోని కరన్‌కోట్ గ్రామంలోని బసవన్న దేవాలయంలో నందీశ్వరుడు పాలు తాగినట్లు సోషల్ మీడియాలో వీడియోలు వైరలయ్యాయి. దీంతో భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. కరన్‌కోట్ గ్రామంలోని మెయిన్ బజార్‌లో పురాతన బసవన్న దేవాలయం ఉంది. గ్రామానికి చెందిన పూజ, స్రవంతి శుక్రవారం ఆలయంలో నైవేద్యం సమర్పించేందుకు వెళ్లారు. అక్కడే ఉన్న నందీశ్వరుడి విగ్రహానికి పాలుతాపే ప్రయత్నం చేయగా... నిజంగా పాలు మొత్తం తాగినట్లు ఆ మహిళలు గ్రామస్తులకు తెలిపారు. దీంతో గ్రామస్తులు పెద్ద ఎత్తున నందీశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయితే పురాతన ఆలయం కావడంతో శనివారం ఉదయం ఆలయం ముందు భాగం కూలిపోయింది. ఇదంతా దేవుడి మహిమ అని త్వరలో ఆలయానికి మరమ్మతులు చేపడతామని ఉప సర్పంచ్ హేమంత్‌కుమార్ తెలిపారు. నందీశ్వరుడు పాలు తాగిన విషయం నిజమేనని ఉపసర్పంచ్ కూడా చెప్పారు.

బీసీలకు రెండు అసెంబ్లీ టికెట్లు ఇవ్వండి

బీసీ సంఘం రాష్ట్ర కన్వీనర్ లాల్‌కృష్ణ

పరిగి: జిల్లాకు రెండు చొప్పున బీసీలకు ఎమ్మెల్యే టిక్కెట్లు ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ లాల్‌కృష్ణ డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని బీసీ నాయకులతో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో పాల్గొన్న లాల్‌కృష్ణ మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీసీలు ఎక్కువ శాతం ఉన్నప్పటికీ రిజర్వేషన్ ఉన్నచోట తప్ప ఎక్కడా బీసీలకు ఎమ్మెల్యే టిక్కెట్లు ఇవ్వడం లేదన్నారు. జనరల్ స్థానాలు ఉన్నచోట కూడా బీసీలకు టిక్కెట్లు ఇచ్చే విధంగా అధిష్టానం చర్యలు తీసుకోవాలని మాణిక్‌రావ్ ఠాక్రేకు వినతి పత్రం అందజేశారు. పలువురు బీసీ నాయకులు పాల్గొన్నారు.



మాణిక్‌రావ్ ఠాక్రేకు వినతిపత్రం అందజేస్తున్న బీసీ నాయకులు



వికారాబాద్: పీర్లకు మొక్కుతున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో మొహర్రం

మొహర్రంను పురస్కరించుకుని గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో పీర్ల ఊరేగింపు నిర్వహించారు. కులమతాలకు అతీతంగా చాదర్‌లను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పూలు, దట్టీలు సమర్పించారు. పీర్ల చావిడి వద్దకు ప్రజలు పెద్ద సంఖ్యలో చేరుకుని అగ్నిగుండం చుట్టూ అలయ్ ఆడుతూ సందడి చేశారు. చివరగా నిమజ్జనం చేశారు.

– సాక్షి, నెట్‌వర్క్



వికారాబాద్: శివారెడ్డిపేట్‌లో పీర్ల ఊరేగింపు

దారులు ధ్వంసం!

వర్షాలకు దెబ్బతిన్న రహదారులు

- తాండూరు నియోజకవర్గంలో 70 కి.మీ మేర రోడ్లు ఛిద్రం
- నత్తనడకన గాజీపూర్ బ్రిడ్జి, కరన్‌కోట్ రోడ్డు నిర్మాణ పనులు
- అధికారుల పర్యవేక్షణ లోపంతో కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం!



తాండూరు- హైదరాబాద్ రోడ్డుపై గుంతలు

తాండూరు టౌన్: భారీ వర్షాలతో రహదారులు దెబ్బతింటున్నాయి. వాగులు, వంకలు పొంగిపొర్లుతూ రోడ్లపైనుంచి వరద పారుతుండటంతో కంకరతేలి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. పలుచోట్ల వరద ప్రవాహానికి రోడ్లు కోతకు గురవ్వడంతో గ్రామాల మధ్య రవాణా నిలిచిపోతోంది. దీనికి తోడు బ్రిడ్జిల, రోడ్ల నిర్మాణంలో జాప్యంతో వాటికి ప్రత్యామ్నాయ మార్గాల గుండా వెళ్లే వాహనదారులు, ప్రయాణికులకు ఇక్కట్లు తప్పడంలేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు అభివృద్ధి పనులను పర్యవేక్షించడంలో అలసత్వం వహిస్తుండటంతో కాంట్రాక్టర్లు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో పాటు జాప్యం చేస్తున్నారంటూ విమర్శలున్నాయి.

తాండూరు నియోజకవర్గంలో..

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తాండూరు నియోజకవర్గ పరిధిలో సుమారు 70 కిలోమీటర్ల మేర రోడ్లు దెబ్బతిన్నట్లు అంచనా. వీటి మరమ్మతులకు గాను రూ.50లక్షల వరకు నిధులు అవసరం ఉంటుంది. వరదలతో తాండూరులోని విలియం మూన్ చౌరస్తా నుంచి రాజీవ్‌కాలనీ వరకు రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. ఈ రోడ్డుపై పెద్దపెద్ద గుంతలు పడటంతో వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు. గౌతాపూర్ నుంచి కరన్‌కోట వరకు నిర్మాణంలో ఉన్న బిటీ రోడ్డు (సుమారు 10 కి.మీ) పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. కేవలం 3 కిలోమీటర్ల మేర రోడ్డు పనులు పూర్తిచేసి వదిలేశారు. బుద్దారం, గాజీపూర్ గ్రామాల మధ్య ఉన్న వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి ఐదేళ్ల కిందట రూ.8.90 కోట్లు కేటాయించి పనులు ప్రారంభించినప్పటికీ ఇప్పటికీ పూర్తికాలేదు. అలాగే బెల్కటూర్ వద్ద బ్రిడ్జి నిర్మాణానికి రూ.3 కోట్లు కేటాయించినప్పటికీ ఇంకా టెండర్ దశలోనే ఉండటం విశేషం. తాండూరు పట్టణ పోలీసు స్టేషన్ నుంచి సాయిపూర్‌కు సీసీ రోడ్డు నిర్మాణం కోసం రూ.3 కోట్లు కేటాయించగా నెలరోజులుగా పనులు నిలిచిపోయాయి. నేషనల్ హైవే అథారిటీ వారు తాండూరు పట్టణం మీదుగా ఎన్‌హెచ్–167ఎన్ కు అనుసంధానిస్తూ సెయింట్ మార్క్స్ పాఠశాల వరకు లింక్ రోడ్డు నిర్మాణం కోసం ఇటీవల రూ.25 కోట్లు కేటాయించారు. దీనికి సంబంధించి పనుల్లో ఎలాంటి పురోగతి లేదు.

కొట్టొస్తున్న నిర్లక్ష్యం..

కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో నియోజకవర్గ పరిధిలోని రోడ్లు, బ్రిడ్జిల నిర్మాణ పనులు ఒక అడుగు ముందుకు రెండడుగులు వెనక్కి అన్నచందంగా తయారయ్యాయి. నియోజకవర్గంలోని అన్ని రోడ్లను ఒకే కంపెనీకి అప్పగిస్తున్నారనేఆరోపణలు ఉన్నాయి. ఏళ్ల తరబడి నిర్మాణ పనులు కొనసాగుతున్నా ప్రజాప్రతినిధులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం కూడా పలు అనుమానాలకు తావిస్తోంది. అయితే ఎడతెరిపిలేని వర్షాల వల్ల నిర్మాణ పనుల్లో జాప్యం జరుగుతోందని కాంట్రాక్టర్లు వాదించినా మరి ఏళ్లతరబడి ఎందుకు సమయం తీసుకుంటున్నారంటే వారినుంచి స్పష్టమైన సమాధానం కరువైంది. వర్షాలు తగ్గేవరకు రోడ్లపై ఏర్పడిన గుంతలకు తాత్కాలిక మరమ్మతులు చేయించాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు. స్థానిక ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని పెండింగ్‌పనులను త్వరగా పూర్తయ్యేలా చూడాలని డిమాండ్ చేస్తున్నారు. రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరుతున్నారు. దెబ్బతిన్న, కోతకు గురైన రోడ్ల విస్తీర్ణం, మరమ్మతులకు సంబంధించి ఎంతమేర నిధులు అవసరమో ఆర్‌అండ్‌బీ అధికారులు ఇప్పటికీ ఉన్నతాధికారులకు పంపకపోవడం గమనార్హం.

ప్రజలు ఇబ్బంది పడుతున్నారు



నియోజకవర్గంలోని అభివృద్ధి పనులకు సంబంధించి ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదు. గాజీపూర్ బ్రిడ్జి నిర్మాణ పనుల్లో జాప్యంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పనులను పర్యవేక్షించాల్సినఅధికారులు.. కాంట్రాక్టర్లతో కుమ్మక్కయ్యారనే విమర్శలున్నాయి. ఎమ్మెల్యే చొరవ తీసుకుని పనులను పూర్తిచేయించాలి.

– రమేష్‌కుమార్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి

ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం



నియోజకవర్గ వ్యాప్తంగా దెబ్బతిన్న రోడ్ల మరమ్మతు పనులకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. సుమారు రూ.50 లక్షల వరకు నిధులు అవసరం ఉంటాయి. గాజీపూర్ బ్రిడ్జికి సంబంధించి రూ.1.50 కోట్ల పనులు పెండింగ్‌లో ఉన్నాయి. కరన్‌కోట్‌తో పాటు మిగిలిన ప్రాంతాల్లో రోడ్ల మరమ్మతులను త్వరలోనే ప్రారంభిస్తాం.

– శ్రీనివాస్, డీఈఈ ఆర్‌అండ్‌బీ, తాండూరు

సీపీఎస్‌ను రద్దుచేసే వరకు పోరాటం

- టీఎస్‌సీపీఎస్‌ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ
- వికారాబాద్, తాండూర్‌లో కొనసాగిన ఓపీఎస్ బస్సు యాత్ర



తాండూరులో ఉద్యోగుల బైక్‌ర్యాలీ

తాండూరు టౌన్: కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్) ఓ మాయాజూదం అని.. ఈ విధానాన్ని రద్దుచేసే వరకు పోరాటం తప్పదని టీఎస్‌సీపీఎస్ ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ అన్నారు. 90 రోజుల పాత పెన్షన్ సాధన సంకల్ప బస్సు యాత్ర శనివారం సాయంత్రం తాండూరుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఖాంజాపూర్ గేట్ నుంచి వందలాది మంది ఉద్యోగ, ఉపాధ్యాయులు ఇందిరా చౌక్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థితప్రజ్ఞ మాట్లాడుతూ.. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసేవరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో యుద్ధం చేద్దామని పిలుపునిచ్చారు. సీపీఎస్ రద్దు కోరుతూ 90 రోజుల పాటు సాధన సంకల్ప బస్సు యాత్ర నిర్వహిస్తున్నామని అన్నారు. ఎన్నికల సమయం దగ్గర పడుతున్నందున మరింత పట్టు బిగించాల్సిన అవసరం ఉందన్నారు.

ఉద్యోగుల్లో అభద్రతాభావం..

వికారాబాద్ అర్బన్: కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం కారణంగా రాష్ట్రంలోని 2 లక్షల మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు అభద్రతా భావంలో ఉన్నారని టీఎస్ సీపీఎస్‌ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ అన్నారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన రథయాత్ర శనివారం వికారాబాద్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా పట్టణంలోని అంబేడ్కర్ భవనం నుంచి ఎన్టీఆర్ చౌరస్తా వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఆగస్టు 12న నిర్వహించనున్న చలో హైదరాబాద్ కార్యక్రమానికి ఉద్యోగులు, ఉపాధ్యాయులు భారీగా తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్, కోశాధికారి నరేష్, జిల్లా అధ్యక్షుడు అనిల్, జిల్లా కార్యదర్శి నర్సింహులు, నరేందర్, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

తక్కువ ఓట్లు వచ్చాయనే కక్ష సాధింపు

- బీఆర్‌ఎస్ సర్కార్‌పై పీసీసీ ప్రధాన కార్యదర్శి రఘువీరారెడ్డి ఫైర్
- కాగ్నానది అసంపూర్తి వంతెన వద్ద నిరసన



కాగ్నానది వంతెన వద్ద ధర్నా నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ధారూరు: ఆరునెలల్లో కాగ్నానది వంతెన నిర్మాణ పనులను పూర్తిచేసి ప్రజల రాకపోకలకు ఏలాంటి ఆటంకం కలుగకుండా చేస్తామని ప్రగల్భాలు పలికిన బీఆర్‌ఎస్ నేతలు.. ఐదేళ్లు గడిచినా ఎందుకు పూర్తిచేయలేదని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల రఘువీరారెడ్డి ప్రశ్నించారు. ధారూరు మండల పరిధిలోని దోర్నాల్–స్టేషన్‌ధారూరు గ్రామాల మధ్యన కాగ్నానదిపై నిర్మిస్తున్న వంతెన వద్ద శనివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎంపీ, ఎమ్మెల్యే ఎన్నికల్లో ఈ మండలం నుంచి బీఆర్‌ఎస్‌కు తక్కువ మెజారిటీ వచ్చిందని.. ఆ కక్షతోనే ఈ ప్రాంత అభివృద్ధికి అధికారపార్టీ సహకరించడంలేదని ఆరోపించారు. కాగ్నానది అలుగుపారిందంటే ఈ మార్గంలో రాకపోకలు నిలచిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వంతెన నిర్మాణం పూర్తయ్యేవరకు పోరాటం చేస్తూనే ఉంటామని ఆయన హెచ్చరించారు. కాగా అసంపూర్తి వంతెన వద్ద బుడగజంగాలతో పాటలు పాడించి వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ధారూరు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ భాస్కర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ పట్లోళ్ల రాములు, నాయకులు.. అశోక్ ముదిరాజ్, బాబాఖాన్, మాన్‌సింగ్, బల్వంత్‌రెడ్డి, బుజ్జయ్యగౌడ్, చెన్నారెడ్డి, దయాకర్‌రెడ్డి, అహ్మద్, గఫార్, దాసు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడులపై చిత్తశుద్ధి ఏదీ?



పెచ్చులూడిన గదిని పరిశీలిస్తున్న రామ్మోహన్‌రెడ్డి, నాయకులు

- బీఆర్‌ఎస్ సర్కార్‌పై టీఆర్‌ఆర్ ఫైర్

పరిగి: ప్రభుత్వ బడులు, విద్యార్థులపై బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి(టీఆర్‌ఆర్) అన్నారు. పరిగి పట్టణ కేంద్రం తుంకుల్‌గడ్డలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వర్షాలకు పాఠశాల పైకప్పు పెచ్చులూడి వర్షపు నీరు తరగతి గదుల్లో వస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ ప్రభుత్వ విద్యావ్యవస్థను పూర్తిగా నీరుగార్చారన్నారు. గురుకుల పాఠశాలల్లో కనీస సౌకర్యాలు కల్పించలేదన్నారు. స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకుని పాఠశాల మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని కోరారు. లేదంటే విద్యార్థుల తల్లిదండ్రులతో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కృష్ణ, మండల అధ్యక్షుడు పరశురాంరెడ్డి, నాయకులు.. పార్థసారధి, మాధవ్‌రెడ్డి, ఆనంద్, జగన్, రామకృష్ణారెడ్డి, నాగవర్ధన్, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు అండగా ఉంటా..

దోమ: నిరుపేదలకు అండగా ఉంటానని డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. దోమ మండల పరిధిలోని ఐనాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ యాదమ్మ అనారోగ్యంతో మృతి చెందగా, బాల్‌రాజ్ విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. కొండాయపల్లి గ్రామానికి చెందిన నర్సమ్మ, గుండాల గ్రామానికి చెందిన బాలప్ప అనారోగ్యంతో మృతి చెందారు. డీసీసీ అధ్యక్షుడు టీఆర్‌ఆర్ శనివారం వారి నివాసాలకు వెళ్లి మృతుల కుటుంబ సభ్యులకు వ్యక్తిగతంగా రూ.5వేల ఆర్థిక సహాయం అందించారు. ఆపదలో ఉన్నవారిని ఆదుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో మండల యూత్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు మహేశ్, హరికృష్ణ, హన్మంతు, రాంచంద్రారెడ్డి, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఏడడుగుల బంధానికి ఏడేళ్ల గుర్తుగా..

- భర్తతో కలిసి నాటిన మొక్కకు పుట్టినరోజు వేడుక

తాండూరు టౌన్: ఆలుమగల అనుబంధానికి గుర్తుగా మిగిలింది ఆ వృక్షం. భర్త బతుకున్న రోజుల్లో కలిసి నాటిన మొక్క నేడు మానువైనా.. మనువాడినవాడికి తీపిగుర్తుగా మలచుకొని.. ఆ పచ్చని చెట్టువద్దే ఏటా అతడి జన్మదిన వేడుకలు నిర్వహిస్తోంది ఓ ఇల్లాలు.తాండూరు మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, వెంకటయ్య భార్యభర్తలు. ఏడేళ్ల క్రితం వెంకటయ్య జన్మదినం సందర్భంగా చించోళి రోడ్డు మార్గంలో ఉన్న వారి నివాసం ఎదుట ఇద్దరూ కలిసి ఓ మొక్క నాటారు. ఏడాది తర్వాత వెంకటయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. నాటి నుంచి కుటుంబసభ్యులతో కలిసి ఆ చెట్టువద్దే వెంకటయ్య జయంతి వేడుకలు నిర్వహించే వారు. రోడ్డు విస్తరణలో భాగంగా చెట్టును అక్కడి నుంచి తొలగించాల్సి రావడంతో వేర్లతో సహా చెట్టును తీసుకెళ్లి తాండూరు వ్యవసాయ పరిశోధనా కేంద్రంలో నాటారు. కాగా శనివారం భర్త వెంకటయ్య జయంతి కావడంతో అదే చెట్టు వద్ద భార్య, బంధువులు వేడుకలు నిర్వహించారు.



చెట్టుకు జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న విజయలక్ష్మి, కుటుంబ సభ్యులు

అందని 'అభయం'

- పథకం ప్రీమియం డబ్బులు తిరిగివ్వడంలో తీవ్ర జాప్యం
- ప్రభుత్వం వద్దే జిల్లాకు సంబంధించిన రూ.7కోట్ల మేర నిధులు
- ఖాతాల్లో జమచేయాలని లబ్ధిదారుల వేడుకోలు

దౌల్తాబాద్: అభయహస్తం పథకం కింద స్వయం సహాయక సంఘాల మహిళలు గతంలో జమ చేసిన పొదుపు డబ్బులు ఎవరివి వారికి తిరిగి చెల్లిస్తామని ఏడాది క్రితం రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించినా నేటికీ అతీగతి లేదు. మహిళలు చెల్లించిన మొత్తాన్ని తిరిగి ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించడంతో అధికారులు హడావుడి చేశారు. దీంతో తమ డబ్బులు తమకు అందనున్నాయని మహిళలు సంతోషపడ్డారు. అయితే వారికి నేటికీ ఎదురుచూపులుతప్పడంలేదు.

2009లో పథకం ప్రారంభం..

2009లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో స్వయం సహాయక సంఘాల్లో చేరి పొదుపు చేస్తున్న మహిళలకు ప్రభుత్వం అమ్మహస్తం పథకాన్ని ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. ప్రతి సభ్యురాలు రోజుకు రూపాయి చొప్పున ఏడాదికి రూ.365 ప్రీమియంగా చెల్లించేలా పథకానికి రూపకల్పన చేసింది. పొదుపు చేసిన వారు సహజంగా మరణిస్తే రూ.30వేలు ఆర్థిక సహాయం, ప్రమదావశాత్తు అయితే రూ.75వేలు.. ఆ కుటుంబానికి ఇవ్వాలని నిర్ణయించింది. ఇక 60 ఏళ్లు దాటిన వారికి నెలకు రూ.500 పెన్షన్ ఇచ్చారు. కానీ తెలంగాణ రాష్ట్రం వచ్చాక ఏడాదికోసారి పెన్షన్లు ఇవ్వడం మొదలుపెట్టి 2017 సంవత్సరం నుంచి పూర్తిగా నిలిపివేశారు. అసలు పథకాన్ని రద్దు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.

రూ.కోట్లలో ప్రీమియం సొమ్ము..

జిల్లాలో 51,314 మంది అభయహస్తం లబ్ధిదారులు ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఇంతకాలం లెక్కలను పరిశీలిస్తే ఏటా అందరూ రూ.365 చొప్పున నాలుగేళ్ల పాటు ప్రీమియం చెల్లించారు. జిల్లాను యూనిట్‌గా తీసుకుంటే 51,314 మంది రూ.365 చొప్పున చెల్లిస్తే ఏడాదికి రూ.1,87,29,610 అవుతుంది. 2009 నుంచి 2014 వరకు ఈ లెక్కన ఈ నాలుగేళ్లలో సభ్యులు చెల్లించిన రూ.7,49,18,440 నిధులు ప్రభుత్వం వద్ద ఉన్నాయి. నిధులపై క్లారిటీ ఇవ్వకుండానే పథకాన్ని రద్దు చేయడంపై అనుమానాలు తలెత్తుతున్నాయి.

ఖాతాల వివరాలు అడిగారు

మండలంలో సుమారు 5వేలకు పైగా మంది లబ్ధిదారులు అభయహస్తం పథకంలో సభ్యులుగా ఉన్నారు. అయితే వీరిలో కొంతమంది ఖాతాల వివరాలు లేవని ఇటీవల జిల్లా అధికారులు అడిగారు. అయితే ఇంతవరకు అభయహస్తం డబ్బుల విడుదలపై ఎలాంటి సమాచారం లేదు.

– సాయన్న, ఏపీఎం, దౌల్తాబాద్

క్లుప్తంగా

ఆటోను తప్పించబోయి విద్యుత్ స్తంభాన్ని ఢీ కొని..

నాపరాతి లారీ బోల్తా



బోల్తాపడిన నాపరాతి లారీ

యాలాల: నాపరాతి లోడ్‌తో వెళ్తున్న ఓ లారీ ఆటోను తప్పించబోయి విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టింది. ఈ సంఘటన లక్ష్మీనారాయణపూర్ సమీపంలో శనివారం ఉదయం 5గంటల ప్రాంతంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..తాండూరు నుంచి కర్నాటకకు నాపరాతి లోడ్‌తో లారీ బయలుదేరింది. మార్గమధ్యలో లక్ష్మీనారాయణపూర్ సమీపంలో చేరుకోగానే ఎస్సార్ పెట్రోల్ పంపు శివారులో ఎదురుగా వచ్చిన ఆటోను తప్పించబోయి రోడ్డు పక్కనే ఉన్న 11 కేవీ విద్యుత్ స్తంభాన్ని ఢీ కొని బోల్తాపడింది. ఈ ఘటనతో లక్ష్మీనారాయణపూర్, దౌలాపూర్, యాలాల సబ్‌స్టేషన్లకు 6గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. అనంతరం ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్ తీగలను సరిచేసి విద్యుత్‌సరఫరాను పునరుద్ధరించారు. ఈ సంఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

రాజకీయాల్లో రాణించాలి



సాయన్న చిత్ర పటానికి నివాళ్లు అర్పిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

వికారాబాద్ అర్బన్: ముదిరాజ్‌లు ఐక్యంగా ఉండి రాజకీయాల్లో రాణించాలని సంఘం జిల్లా అధ్యక్షుడు గొట్టిముకుల శ్రీనివాస్ అన్నారు. జనాభాలో 15 శాతం ఉన్న తమకు రాజకీయంగా తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ముదిరాజ్ వీరుడు పండుగల సాయన్న జయంతిని శ్రీ వివేకావాణి విద్యాలయంలో నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిజాం కాలంలో బీసీ వర్గానికి చెందిన ముదిరాజ్ బిడ్డ పండుగల సాయన్న పెత్తందారి విధానానికి వ్యతిరేకగాం పోరాడిన గొప్ప ధీరుడని కొనియాడారు. ముదిరాజ్ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య, దుద్యాల లక్షణ్, ఎం. నాగయ్య ముదిరాజ్, పట్టణ అధ్యక్షుడు లక్ష్మణ్, డి. గోపాల్, పండరినాథ్, రమేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

బండి సంజయ్ నియామకంపై హర్షం

తుక్కుగూడ: బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ కుమార్‌ను పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియమించడంపై ఆ పార్టీ తుక్కుగూడ మున్సిపాలిటీ అధ్యక్షుడు రచ్చ లక్ష్మణ్ శనివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. బండి సంజయ్ మరిన్ని పదవులు అలంకరించాలని ఆయన ఆకాంక్షించారు.

అనంత.. ఆనందం..



అనంతగిరిలో ఎంజాయ్ చేస్తున్న పర్యాటకులు

పెరిగిన పర్యాటకుల తాకిడి

అనంతగిరికి శనివారం పర్యాటకుల తాకిడి పెరిగింది. సెలవు దినం కావడంతో ఆయా ప్రాంతాల నుంచి పర్యాటకులు కుటుంబ సమేతంగా, స్నేహితులతో వచ్చి అడవిలో ఆనందంగా గడిపారు. ముఖ్యంగా నంది ఘాట్ సమీపంలో గుట్టల మధ్యలో నుంచి వస్తున్న నీళ్ల వద్ద ఆటలాడారు. ఫొటోలు దిగారు. వారు సాయంత్రం వరకు సందడి చేశారు.

– అనంతగిరి



సందడి చేస్తున్న యువకులు

పంటల రుణం.. పెంపు అంతంతే..!

సీజన్ ఆరంభంలో పెంచిన ప్రభుత్వం

- రెండింతలవుతున్న పెట్టుబడులు
- చాలీచాలని రుణాలతో రైతుల ఇబ్బందులు
- అధికారులు పట్టించుకోవాలని మొర

వికారాబాద్: ప్రభుత్వం నిర్ణయిస్తున్న పంటల రుణ పరిమితి పెట్టుబడులకు ఏమాత్రం సరిపోవడం లేదు. వారిచ్చే రుణాలకు ఖర్చులు రెండింతలవుతున్నాయి. రైతులు పంటల సాగులో అధునాతన పద్ధతులు అవలంబించాలని చెబుతున్నా ప్రభుత్వాలు అందుకనుగుణంగా రుణ పరిమితి పెంచటంలో విఫలమవుతున్నారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి ఇటీవల ఖరీఫ్ సీజన్ ఆరంభంలోనే ప్రభుత్వం ప్రకటించింది. ఈసారి కూడా పంట పెట్టుబడులకు అయ్యే ఖర్చుకు వారు ప్రకటించిన రుణ పరిమితికి ఎక్కడా పొంతనలేదు. ప్రధానంగా టమాటా, వంకాయ, అరటి, పూలతోటలు, మామిడి తోటలు తదితర ఉద్యానవన పంటలకు పెట్టుబడి ఖర్చు రూ. లక్ష నుంచి రూ.3 లక్షల వరకు అవుతుండగా ప్రభుత్వం మాత్రం అందులో సగం కూడా ఇవ్వటం లేదు. దీంతో రైతులు మళ్లీ పెట్టుబడులకోసం అప్పులు చేయక తప్పటంలేదు. వికారాబాద్ జిల్లాలో సాగుదారులు 2.8లక్షలు ఉన్నట్లు వ్యవసాయాధికారులు పేర్కొన్నారు. వీరిలో 2.1 లక్షల మంది రుణాలు తీసుకున్నారు. జిల్లాలో సుమారుగా 8వేల మంది కౌలు రైతులు ఉన్నట్టు గతంలో గుర్తించగా వీరికి బ్యాంకర్లు రుణాలు ఇవ్వడం లేదు.

చాలీచాలని పెంపు..

పంట రుణపరిమితి పెంపును ప్రభుత్వం ఎట్టకేలకు సీజన్ ఆరంభంలో ప్రకటించింది. రోజురోజుకు సాగుపెట్టుబడి పెరుగుతున్నా ప్రభుత్వం మాత్రం చాలీచాలని రుణపరిమితి అమలు చేస్తోంది. గత కొంతకాలంగా రుణపరిమితి పెంచాలని ప్రతిపక్షాలు, రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూనే ఉన్నాయి. వ్యవసాయం దండగ కాదు..పండగలా చేసేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, చెబుతున్న మాటల్లో పొంతన లేదు. దీంతో రుణపరిమితిని కూడా పంటలవారీగా పెంచింది. దీంతో



పరిగిలో రైతులు సాగు చేసిన వరి పంట

అన్నదాతలకు కాస్త ఉపశమనం కలిగినా వారు ఆశించిన స్థాయిలో ఈ పెంపు కనిపించలేదు.

రుణప్రణాళిక ఖరారు ఇలా..

ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంకు లిమిటెడ్ (టెస్కాబ్) ఆధ్వర్యంలోని రాష్ట్రస్థాయి సాంకేతిక కమిటీ రుణప్రణాళికను తయారు చేసి నాబార్డుకు, వ్యవసాయశాఖకు అందజేస్తుంది. ఈ నివేదిక ఆధారంగా నాబార్డు వ్యవసాయ రుణ ప్రణాళికను రూపొందిస్తుంది. పత్తి, పసుపు లాంటి వాణిజ్య పంటలకు ఎకరానికి కాస్త ఎక్కువగా రుణాలను అందజేస్తారు. ఆరుతడి తదితర పంటలకు తక్కువ ఇస్తున్నారు. జిల్లాలో పండించే ప్రధాన పంటలను మొదటగా గుర్తిస్తారు. ఇందులో వాణిజ్య పంటలు, సాధారణ పంటల జాబితాను వేరు వేరుగా తయారుచేస్తారు. పంటలవారీగా సాగువ్యయం సాగు ఆధారంగా పంటల రుణపరిమితిని ఖరారుచేస్తున్నారు. సాగునీటి వసతి ఉన్న పంటలకు ఒకరకంగానూ, నీటి వసతిలేని పంటలకు మరోరకంగా పంటల రుణపరిమితిని అధికారులు నిర్ణయిస్తారు.

పంటల వారీగా రుణపరిమితి..

జిల్లాలో అధికంగా పండించే కందిపంటకు ఎకరానికి కనిష్టంగా రూ.18వేల నుంచి గరిష్టంగా 22 వేల వరకు నిర్ణయించారు. వరి పంటకు రూ.38 వేలనుంచి 42వేల వరకు, పత్తిపంట రూ.32,400ల నుంచి రూ.38,400లు, అదే విధంగా పెసర పంటకు ఎకరానికి రూ.18వేల నుంచి 20వేలు, పచ్చి మిర్చి సాగుకు రూ.68 నుంచి 75వేలు, వేరుశనగకు రూ.32 నుంచి 35వేలు, అత్యధికంగా అరటి రూ.65నుంచి 80వేలు, సన్‌ఫ్లవర్ రూ.19వేల నుంచి 24వేలు, జొన్న రూ.17వేల నుంచి రూ.20వేలు, రాగులు రూ.16వేల నుంచి 20వేలు, మినుములు రూ.18నుంచి 20వేలు, మొక్కజొన్న రూ.38 నుంచి 42వేల వరకు రుణాలను బ్యాంకర్లు అందజేయవచ్చని ప్రభుత్వం పేర్కొంది. ఈ ఖరీఫ్ సీజన్‌నుంచి ఈ రుణపరిమితిని అందజేయాలని ప్రకటించింది.

మాతా శిశు ఆసుపత్రిలో రోగుల ఇక్కట్లు

- వర్షానికి తడిసి ముద్దయిన భవనం
- గోడలు తడవడంతో విద్యుత్ షార్ట్ సర్క్యూట్
- పాడైన కంప్యూటర్లు, సాంకేతిక పరికరాలు
- నాసిరకం పనులు చేపట్టడంతోనే దుస్థితి

తాండూరు: సాధారణ ప్రసవాలతో రాష్ట్రంలోనే తొలి స్థానంలో నిలిచిన మాతా శిశు ఆసుపత్రి ఒక్క వానతో పరిస్థితి దారుణంగా మారింది. వారం రోజులుగా కురుస్తున్న వర్షానికి మాతా శిశు ఆసుపత్రి భవనం వర్షపు నీటితో తడిసి ముద్దయింది. గర్భిణులు, బాలింతల వార్డుల్లో వర్షపు నీరు చేరడంతో ప్రమాదకరంగా తయారైంది. ఏడాదిన్నర క్రితం వరకూ జిల్లా ఆసుపత్రి భవనంలోనే మాతా శిశువులకు వైద్య సేవలు అందాయి. ఇటీవల కాలంలో హైదరాబాద్ రోడ్డు మార్గంలో తాండూరు పట్టణ శివారులో కోట్ల రూపాయలతో నిర్మించిన మాతా శిశు ఆసుపత్రి భవనంలోకి గతేడాది జనవరిలో అందుబాటులోకి తెచ్చారు. నాటి నుంచి వర్షం పడితే చాలు భవనం పైకప్పు నుంచి వర్షపు నీరు చేరుతుంది. దీంతో ఇక్కడ గదుల్లోని గోడలు తడుస్తున్నాయి. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కంప్యూటర్‌లు, వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసే సాంకేతిక పరికరాలు పాడైపోయాయి. ఆసుపత్రిలో గోడలను ముట్టుకుంటే విద్యుత్ షాక్ తగిలే అవకాశం ఉందని సిబ్బంది, రోగుల బంధువులు భయాందోళనకు గురవుతున్నారు. మరోవైపు నవజాతా శిశువులకు అందించే ప్రత్యేక విభాగం పైకప్పు నుంచి వర్షపు నీరు లోపల పడుతుంది. దీంతో రోగుల ఇక్కట్లు వర్ణనాతీతం.

నాసిరకం పనులతోనే..

అధికారుల పర్యవేక్షణ లోపంతోనే కాంట్రాక్టర్లు నాసిరకంగా పనులు చేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రభుత్వం తాండూరు నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు వందల కోట్లను మంజూరు చేసింది. అయితే కాంట్రాక్టర్‌లు నాసిరకంగా పనులు చేసి మమ అనిపిస్తున్నారంటూ విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నాణ్యత ప్రమాణాలు పాటించకుండానే పనులు చేయడం వల్లే మాతాశిశు ఆసుపత్రిలోకి వరద నీరు చేరుతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ప్రసూతి వార్డు పైకప్పులో చేరిన నీరు



తడిసిన ఆసుపత్రి మొదటి అంతస్తు పైకప్పు

‘సోయం’ వ్యాఖ్యలు సరికాదు

- బీజేపీ ఎంపీ బాపూరావుపై చర్యలు తీసుకోవాలి
- లంబాడా హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గోపాల్ నాయక్



మాట్లాడుతున్న గోపాల్‌నాయక్

కుల్కచర్ల: లంబాడాలపై ఇష్టానుసారంగా బీజేపీ ఎంపీ సోయం బాపురావు చేస్తున్న వాఖ్యలు సరికాదని లంబాడా హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గోపాల్ నాయక్ అన్నారు. శనివారం కుల్కచర్ల మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలనే దురుద్దేశంతో లంబాడా, చెంచు, ఆదివాసీల మధ్య ఘర్షణలకు తావిచ్చేవిధంగా ఎంపీ బాపురావు మాట్లాడడం బాధాకరమన్నారు. లంబాడాలపై ఇష్టానుసారంగా వాఖ్యలు చేస్తే ఊరుకోమని ఆయన హెచ్చరించారు. ఈ విషయంలో బీజేపీ మంత్రులు స్పందించి ఎంపీ బాపురావుని బర్తరఫ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ఇలాంటి ప్రకటనలు ఆపకపోతే రానున్న కాలంలో మూల్యం చెల్లించక తప్పదని గోపాల్ నాయక్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకాశ్ నాయక్, బలరాంనాయక్, బాలాజీ నాయక్, హన్మంతునాయక్, రమేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

హరితంపై గొడ్డలి పెట్టు

విద్యుత్ వైర్లకు దూరంగా నాటాలని మొర



పెద్దేముల్‌లో కరెంటు వైర్లకు తగులుతుందని నరికిన చెట్టుకొమ్మ

పెద్దేముల్: భావితరాలకు మంచి స్వచ్ఛమైన గాలిని అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం హరితహారాన్ని ప్రతిష్టాత్మంగా అమలు చేస్తుంది. నాటిన ప్రతి మొక్కను కాపాడుకోవల్సిన బాధ్యత అందరిపై ఉందని చెబుతుంది. దీంతో హరితహారానికి పెద్దెతున నిధులను కూడా కేటాయిస్తుంది. పెద్దేముల్ మండలంలో తాండూరు–సంగారెడ్డి, తాండూరు–హైదరాబాద్, తాండూరు–జహీరాబాద్ ప్రధాన రహదారులపై పెద్దేముల్, మంబాపూర్, ఇందూరు, గాజీపూర్, బుద్దారం, కందనెల్లితండా, మన్‌సాన్‌పల్లితో పాటు పలు గ్రామాల్లో ప్రధాన రోడ్ల పక్కన పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాలు చేస్తున్నారు. నాటిన మొక్కలు పెరగడంతో అవీ కరెంటు తీగలకు తగులు తున్నాయనే నెపంతో నరికివేయడం బాధాకరమని స్థానికులు చెబుతున్నారు. మొక్క నాటే సమయంలోనే కరెంటు స్తంభాలకు, భవనాల గోడలకు దూరంగా నాటితే బాగుంటుందని సలహా ఇస్తున్నారు. ఈ విషయంలో సంబంధిత అధికారులు ఎందుకు శ్రద్ధ చూపడం లేదని పలు గ్రామాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గత రెండు రోజుల క్రితం తాండూరు–సంగారెడ్డి ప్రధాన రహదారిపై పెద్దేముల్ మండల కేంద్రంలో బ్యాంక్ ఆఫ్ బరోడా బ్యాంకు ఎదుట విద్యుత్ వైర్లకు తగులుతుందని చెట్టును నరికివేశారు. ఇప్పటికైనా మొక్క నాటేటప్పుడ తగిన జాగ్రత్త వహించి నాటాలని కోరుతున్నారు.

జంగమ సమాజ అభివృద్ధికి కృషి చేయాలి



జంగమ సమాజ నియోజకవర్గ, పట్టణ నూతన కమిటీ

అనంతగిరి: జంగమ సమాజ అభివృద్ధికి నూతనంగా ఎన్నికైన సభ్యులు కృషి చేయాలని జిల్లా కన్వీనర్, ఎన్నికల అధికారి మఠం రాజశేఖర్ అన్నారు. శనివారం బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో వికారాబాద్ పట్టణ, నియోజకవర్గ జంగమ సమాజ నూతన కమిటీ ఎన్నుకున్నారు. పట్టణ కమిటీ గౌర అధ్యక్షుడిగా విశ్వేశ్వర్, అధ్యక్షుడిగా నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా మల్లేశం, కోశాధికారిగా సతీష్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా జగదీశ్వర్, శివకుమార్, కార్యదర్శులుగా శ్రీకాంత్, చంద్రశేఖర్, ప్రచార కార్యదర్శిగా అశోక్‌స్వామి ఎన్నికయ్యారు.

వికారాబాద్ నియోజకవర్గం..

గౌరవ అధ్యక్షుడిగా పార్వతయ్య స్వామి, అధ్యక్షుడిగా శ్రీశైలం, ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్, కోశాధికారిగా కళ్యాణయ్య, ఉపాధ్యక్షుడిగా చెన్న బసవేశ్వరస్వామి, సిద్ధిరామయ్య, శివకుమార్, వినోద్, కార్యదర్శులుగా గంగాధర్, అఖిలేష్, పవన్‌కుమార్, రాకేష్, బస్వలింగం, సంపత్‌కుమార్‌లను ఎన్నుకున్నారు. ముఖ్య సలహాదారులుగా ఆర్‌ఎం దయానంద్‌స్వామి, బస్వరాజు లాకే వైద్యనాథ్, సంగయ్యస్వామి, ప్రచార కార్యదర్శులుగా రాకేశ్, వినయ్‌లను నియమించారు.

డబుల్ ఇంజన్ సర్కారుతోనే అభివృద్ధి

షాద్‌నగర్ రూరల్: కేంద్రంలో, రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కారు ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యమని బీజేపీ సీనియర్ నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం కొందుర్గు మండలం టేకులపల్లి, ఉత్తరాశిపల్లి గ్రామాలకు చెందిన 80మంది ఆ మండల అధ్యక్షుడు నర్సింహ ఆధ్వర్యంలో అసెంబ్లీ కన్వీనర్ డాక్టర్ విజయకుమార్ అధ్యక్షతన పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో విష్ణువర్ధన్‌రెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు భూపాలాచారి మాట్లాడారు. రాష్ట్రంలో కేసీఆర్ అవినీతి, కుటుంబ పాలనను అంతం చేసేందుకు యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కేసీఆర్ తప్పుడు వాగ్దానాలతో మభ్యపెడుతూ మోసం చేస్తున్న విషయాన్ని ప్రజలు గమనించాలన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న బీఆర్‌ఎస్‌ను ఇంటికి పంపాలన్నారు. రాష్ట్రంలో పార్టీ రోజురోజుకూ బలోపేతం అవుతోందని అన్నారు. ఈ నెల 31న మహబూబ్‌నగర్‌లో నిర్వహించే పార్లమెంట్ ప్రబాస్ యోజన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

దేవుని ఎర్రవల్లిని చేవెళ్లలో కలపొద్దు

చేవెళ్ల: మా గ్రామాన్ని చేవెళ్ల మున్సిపాలిటీలో కలపొద్దంటూ దేవునిఎర్రవల్లి గ్రామస్తులు మంత్రి సబితారెడ్డి, చేవెళ్ల ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డిని కలిసి విన్నవించారు. శనివారం ఉదయం పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గం సమన్వయ సమితి అధ్యక్షుడు చింపుల సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో పలువురు మంత్రికి, ఎంపీకి వినతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మా గ్రామాన్ని చేవెళ్ల మున్సిపాలిటీలో కలపవడం వల్ల గ్రామ ఉనికి కోల్పోతుందని తెలిపారు. అంతేకాకుండా ఉపాధి హామీ పనులు లేకుండా పోతాయని పేర్కొన్నారు. అభివృద్ధి కూడా ఆగిపోతుందని అన్నారు. చేవెళ్లను మున్సిపాలిటీగా చేయడానికి తాము వ్యతిరేకం కాదన్నారు. తమ గ్రామాన్ని పంచాయతీగానే ఉండేలా చూడాలన్నారు. మున్సిపల్ పరిధిలోకి వెళితే పన్నులు పెరిగే అవకాశం ఉంటుందన్నారు. తమ గ్రామాన్ని విలీనం లోనుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. కాదని మున్సిపాలిటీలో కలిపితే ఉద్యమిస్తామన్నారు. దీనిపై మంత్రి సబితారెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని వారు కోరారు. స్పందించిన మంత్రి, ఎంపీ గ్రామస్తులతో మాట్లాడి వారి అభిప్రాయం మేరకు నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. మున్సిపాలిటీలో కలిస్తే అభివృద్ధికి అవకాశం ఉంటుందని మంత్రి చెప్పినట్లు గ్రామస్తులు తెలిపారు.

చినుకు పడితే చిత్తడే..!

అధ్వానంగా లింకురోడ్లు

దౌల్తాబాద్: దౌల్తాబాద్ మండలంలో వివిధ పల్లెలకు అనుసంధానంగా నిలుస్తున్న లింక్‌రోడ్లు వర్షం పడితే చాలు బురదమయంగా మారుతున్నాయి. ఈ రోడ్లపై పాదాచారులు నడిస్తే జారుతుందని ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఈ రోడ్లపై నడవాలంటే వాహనదారులకు, పాదచారులకు ఇబ్బందులు తప్పడం లేదు. కాలుతీసి కాలు మోపడం కష్టంగా మారుతుంది. నందారం నుంచి కుదురుమళ్ల గ్రామాలను కలిపే మట్టిరోడ్డు పాలకుల శీతకన్నుతో నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. ఇందాపూర్ నుంచి ఊరగుంట రోడ్డు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. తిర్మలాపూర్–తిమ్మారెడ్డిపల్లి గ్రామాల మధ్య ఉన్న 3కి.మీ లింకు రోడ్డు, దౌల్తాబాద్–కౌడీడ్, సురాయిపల్లి–ఇందాపూర్ లింక్ రోడ్లు సైతం అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిచాయి. చినుకు పడితే చిత్తడిగా మారుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చొరవ తీసుకోవాలని పలువురు గ్రామస్తులు కోరుతున్నారు.



కుదురుమళ్ల రోడ్డుపై బురదలో నడుస్తున్న విద్యార్థులు



సిబ్బందితో మాట్లాడుతున్న ఏసీపీ రంగస్వామి

పీఎస్ సందర్శన

కేశంపేట: షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి శనివారం కేశంపేట పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి వివిధ ఫైళ్లు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా రానున్న ఎన్నికల్లో సిబ్బంది నిర్వహించాల్సిన విధులను ఆయన వివరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ బీఎస్‌ఎస్ వరప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.